సంపుటి :02 సంచిక :243 పేజీలు :06

వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

శనివారం 29, నవంబర్ 2025



# ఎయిర్ పోర్టుకు ప్రధానిచే భూమి పూజ

- పూర్తయిన డిజైన్, తొలిదశలో భూసేకరణ
- ఇక్కడి నుంచి ముందుగా ఏటీఆర్ నడుపుతాం
- ట్రైబల్ యూనివర్సిటీకి కూడా ప్రధాని భూమి పూజ చేస్తారు
- బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ది కపట నాటకం
- కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి

03



# కిక్కే కిక్కు!

## ఆరంభంలోనే మద్యం షాపు ఓనర్లకు భారీ ఆదాయం



తెలంగాణలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. శనివారంతో మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల పర్వం పూర్తయింది. ఇక అభ్యర్థులు ప్రచారంలోకి దిగడమే తరువాయి. అలాగే త్వరలో రెండు, మూడో విడతల ఎన్నికల ప్రక్రియ కూడా మొదలుకానుంది. నామినేషన్లు, ప్రచారం, అలకలు, బుజ్జగింపులు... ఇలా ఎంతో జరుగుతుంది. ఇలాంటి సందర్భంలో రాష్ట్రంలో డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం షాపులు ప్రారంభం కానున్నాయి. లైసెన్స్‌లు దక్కించుకున్న వారు మద్యం షాపులు ప్రారంభించనున్నారు. షాపు తెరవగానే పంచాయతీ ఎన్నికలు రావడం. ఆ తంతు సుమారు 20 రోజులపాటు సాగుతుండటంతో వారి పంట పండినట్లయింది.

– అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి :




- 1వ తేదీ నుంచి కొత్త వైన్ షాపులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 294 దుకాణాలు
- పల్లెల్లో పంచాయతీ ఎన్నికల కోలాహలం
- సుమారు 20 రోజులపాటు సందడే సందడి
- దసరా కంటే రెట్టింపు మద్యం అమ్మకాలకు అవకాశం

02

# స్థానికులకు ఉద్యోగ అవకాశాలు

- మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ 75% పూర్తి
- వచ్చే ఏడాది నాటికి పూర్తి చేస్తాం
- యూనిట్ అందుబాటులోకి వస్తే బహుళ ప్రయోజనాలు
- కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి
- కాజీపేటలోని మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ సందర్శన

03

# రేపటి నుంచి రెండో విడత నామినేషన్లు

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ఎంపీడీవోలు, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్



05

# చివరి రోజు నామినేషన్ల జోరు

## ముగిసిన తొలివిడుత గడువు

- మూడో రోజూ భారీగా దాఖలు
- సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటాపోటీగా నామినేషన్లు
- రేపటి నుంచి రెండో విడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ
- ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

05



# లైసెన్స్ డ్ వెపన్స్ పీఎస్ లో డిపాజిట్

**- మొగుళ్ళపల్లి ఎస్సై బి అశోక్**

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మొగుళ్ళపల్లి మండల పరిధిలోని రెండు లైసెన్స్ వెపన్స్ ను మొగుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ లో డిపాజిట్ చేసినట్లు మొగుళ్ళ పల్లి ఎస్సై బి అశోక్ తెలిపారు మండలంలోని ఆకినపల్లి గ్రామానికి ఒక వ్యక్తికి చెందిన లైసెన్సు వెపన్ తో పాటు మొగుళ్ళపల్లి ఎస్బిఐ బ్యాంకు లో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డ్ వద్ద ఉన్న తుపాకీని మొగుళ్ళపల్లి పోలీసు లకు అందించినట్లు ఎస్సై తెలిపారు.



# జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: భూపాలపల్లి జిల్లా జడ్జి సిహెచ్ రమేష్ బాబు ను శనివారం భూపాలపల్లి జిల్లా ఎ స్పీ శిరిశెట్టి సంకీర్త్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు ఈ సందర్భంగా చట్టం—శాసన వ్యవస్థ సమన్వయం, శాంతి భద్రతల నిర్వహణ, కేసుల వేగవంతమైన పరిశీలన వంటి అంశాలపై పరస్పర చర్చలు జరిపారు. జిల్లాలో న్యాయ వ్యవస్థ మరియు పోలీసు వ్యవస్థ మధ్య మరింత సమన్వయం పెంపొందించేందుకు చేపడుతున్న చర్యలపై ఎస్పీ జిల్లా జడ్జి కి వివరించారు.





అక్షర దర్బార్ Voice of the people



# కిక్కే కిక్కు!

- **ఆరంభంలోనే మద్యం షాపు ఓనర్లకు భారీ ఆదాయం**
- **1వ తేదీ నుంచి కొత్త వైన్ షాపులు**
- **ఉమ్మడి వరంగల్ జిల్లాలో 294 దుకాణాలు**
- **పల్లెల్లో పంచాయతీ ఎన్నికల కోలాహలం**
- **సుమారు 20 రోజులపాటు సందడే సందడి**
- **దసరా కంటే రెట్టింపు మద్యం అమ్మకాలకు అవకాశం**

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: తెలంగాణలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. శనివారంతో మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల పర్వం పూర్తయింది. ఇక అభ్యర్థులు ప్రచారంలోకి దిగడమే తరువాయి. అలాగే త్వరలో రెండు, మూడో విడతల ఎన్నికల ప్రక్రియ కూడా మొదలుకానుంది. నామినేషన్లు, ప్రచారం, అలకలు, బుజ్జగింపులు... ఇలా ఎంతో జరుగుతుంది. ఇలాంటి సందర్భంలో రాష్ట్రంలో డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం షాపులు ప్రారంభం కానున్నాయి. లైసెన్సు దక్కించుకున్న వారు మద్యం షాపులు ప్రారంభించనున్నారు. షాపు తెరవగానే పంచాయతీ ఎన్నికలు రావడం. ఆ తంతు సుమారు 20 రోజులపాటు సాగుతుండటంతో వారి పంట పండినట్లయింది.

**- స్వస్థలాలకు గ్రామస్తులు**

పట్టణాలు, నగరాలకు ఉద్యోగాలు, ఉపాధి కోసం వెళ్లినవారంతా ఓటు వేసేందుకు స్వస్థలాలకు వస్తారు. చుట్టాలు.. పక్కాలు అంటూ గ్రామాల్లో సందడి నెలకొంటుంది. పల్లె వాతావరణం పండుగలా కనిపిస్తుంది. పల్లెవాసులు ముచ్చటకైనా మద్యం కొని, సన్నిహితులు, బంధువులతో కలిసి మద్యం తాగడం పరిపాటి. ఇవన్నీ మద్యం షాపుల యజమానులకు కలసి వచ్చే అంశం. అదీగాక ఎవరు కాదన్నా.. అవునన్నా.. ఎన్నికల్లో ప్రలోభాలు ఉంటాయని, మద్యం ఏరులై పారుతుందన్నా విషయం తెలిసిందే. ఎన్నికల్లో గెలిచేందుకు పోటీ చేసే అభ్యర్థులు ఎంత కష్టపడైనా, ఎంత ముట్టజెప్పి అయినా ఎన్నికల్లో గెలవాలని చూస్తారు. ఒక్కో అభ్యర్థి భారీగా మద్యం కొనుగోలు చేసే పరిస్థితి అనివార్యమవుతుంది. ఈ నేపథ్యంలో మద్యం సేల్స్ పెరిగే అవకాశం ఉంది.

**- జిల్లాల వారీగా షాపులు**

వరంగల్ రూరల్ జిల్లాలో 57, హనుమకొండ అర్బన్ పరిధిలో 67, జనగామ జిల్లాలో 50, మహబూబాబాద్ జిల్లాలో 61, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు కలిపి 59 మద్యం షాపులున్నాయి. ఇలా డిసెంబర్ 1 నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 294 మద్యం షాపులు ప్రారంభం కానున్నాయి. ఎక్సైజ్శాఖ ములుగు, భూపాలపల్లి జిల్లాలకు సంబంధించి ఉమ్మడి కోటా ప్రకటించింది. డిసెంబర్ నెలలో మూడు విడతలుగా జిల్లాలో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల కోలాహలం గ్రామాల్లో సుమారు 20 రోజుల పాటు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ అనుచర గణాన్ని, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు భారీగా ఖర్చు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా వైన్ షాపుల వద్ద జాతరను తలపించేలా విక్రయాలు ఉంటాయని అంచనా.

**- దసరా కంటే ఎక్కువ ఉండే అవకాశం**

ఎన్నికల సందర్భంగా మద్యం కొనుగోళ్ల జోరు దసరా పండుగను కూడా మించిపోతుందని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పంచాయతీ ఎన్నికలు ముగిసే నాటికి ఈ ఆదాయం రెట్టింపు అయ్యే అవకాశం ఉందని ఎక్సైజ్శాఖ అంచనా వేస్తుంది. షాపులు ప్రారంభమైన తొలి నెలలోనే యజమానులు అత్యధిక లాభాలు ఆర్జించడం ఖాయమే. ఒకవైపు ఎన్నికలు, మరోవైపు డిసెంబర్ 31 వేడుకలు, అవి వెళ్లిపోగానే సంక్రాంతి పండుగ రానుంది. ఇవన్నీ కొత్త వైన్ షాపు యజమానుల పంట పండించనున్నాయి.

# అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా..

**- పరికిపండ్ల అశోక్**



అక్షర దర్బార్, కేసముద్రం : కాట్రపల్లి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాట్రపల్లి సర్పంచ్ గా అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని పరికిపండ్ల అశోక్ అన్నారు. శనివారం నాడు కాట్రపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాట్రపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను చూసే సర్పంచ్ బరిలోకి వచ్చానని తెలిపారు. పేద మధ్యతరగతి కుటుంబాల జీవిత స్థితిగతులను మార్చడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థిగా ప్రజల ముందుకు వస్తున్నానని తనను సర్పంచిగా గెలిపించి ఆదరించాలన్నారు. గ్రామంలోని సమస్యలను తన సమస్యగా స్వీకరించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాట్రపల్లి గ్రామ ప్రజలు ఆశీర్వదించి ఆదరించాలని ఈ సందర్భంగా వారు ప్రజలను కోరారు. గత బిఆర్ఎస్ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి ప్రజలను అష్ట కష్టాల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# నామినేషన్ ప్రక్రియలో జాగ్రత్త వహించాలి

**అభ్యర్థి వెంట ఇద్దరు బలపరిచే వ్యక్తులు మాత్రమే రావాలి**

**తహసీల్దార్ గిరిబాబు, ఎస్ఐ రాజు, ఎంపీడీవో మూడు రాజు**



అక్షర దర్బార్ వెంకటాపూర్ : గ్రామ పంచాయతీ ఎన్నికలలో నామినేషన్ వేసే అభ్యర్థులు పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు వహించాలని తహసీల్దార్ గిరిబాబు, ఎస్ఐ చల్ల రాజు, ఎంపీడీవో మూడు రాజు లు సూచించారు. నామినేషన్ దాఖలు పై వెంకటాపూర్ తాసిల్దార్ కార్యాలయంలో శనివారం పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.నామినేషన్తో పాటు ఇద్దరు సాక్షులతో సెల్ఫ్ డిక్లరేషన్ దాఖలు చేయాలని, ఎవరైనా అభ్యర్థి నామినేషన్తో పాటు సెల్ఫ్ డిక్లరేషన్ను దాఖలు చేయడంలో విఫలమైతే, అతను/ఆమె దానిని నామినేషన్ వేసే చివరి తేదీ సాయంత్రం 5.00 గంటలలోపు దాఖలు చేయాలని పేర్కొన్నారు. డిక్లరేషన్ కోసం అఫిడవిట్ కానీ, నోటరీ కానీ అవసరం లేదని తెలిపారు. అన్ని నిలువు వరుసలను పూరించాలి. ఏ కాలమ్ను ఖాళీగా ఉంచకూడదన్నారు. ఏదైనా వస్తువుకు సంబంధించి అందించడానికి సమాచారం లేకుంటే, సందర్భానుసారంగా నిల్ లేదా వర్తించదు అని పేర్కొనాలన్నారు. పోస్టల్, బ్యాంక్ ఖాతా లేదా ఇతర బ్యాంక్ లలో ఖాతాలు అయినా నామినేషన్ వేసే అభ్యర్థి నూతన బ్యాంకు ఖాతా తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల అభ్యర్థులకు కుల ధృవీకరణ పత్రం తప్పనిసరిగా జత చేయాలన్నారు. సర్పంచ్, వార్డ్ మెంబర్ సెక్యూరిటీ డిపాజిట్ చేయవలసి ఉంటుందని సూచనలను నామినేషన్ వేసే అభ్యర్థులు తప్పకుండా పాటించాలని అన్నారు.

# నామినేషన్లను పరిశీలించిన డీఎస్పీ



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: స్థానిక సంస్థల నామినేషన్ల నేపథ్యంలో భూపాలపల్లి డీఎస్పీ ఏ.సంపత్ రావు శనివారం మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియను చిట్యాల సీఐ మల్లేష్ మొగుళ్ళపల్లి ఎస్సై బి.అశోక్ తో కలిసి పరిశీలించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు కిందిస్థాయి సిబ్బందికి సూచనలు చేశారు.

# మహా అన్నప్రసాదం



అక్షర దర్బార్ , పరకాల: పరకాల పట్టణంలోని హరిహరసుత అయ్యప్ప ఆలయంలో శనివారం రఘు రాజిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో మహా అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు బాపూరావు గురుస్వామి, దేశపతి గురుస్వామి, కానుగుల గోపీనాథ్, సంఘ పురుషోత్తం, చాట్ల రజినీకాంత్, బండారి యాదగిరి, తదితరు స్వాములు పాల్గొన్నారు.

# జాతరలో భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**: డాక్టర్ రవీందర్ నాయక్**

అక్షర దర్బార్, ములుగు ప్రతినిధి : ములుగు జిల్లాలో రాబోయే శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర 2026లో భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు. ములుగు కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వైద్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. డిసెంబర్ 25 నుంచి ఫిబ్రవరి 10 వరకు దశలవారీగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రారంభంలో రోజుకు 3 క్యాంపులు, తరువాత 10, 20గా పెంచి, రద్దీ ఎక్కువగా ఉండే జనవరి 28–31 తేదీల్లో రోజుకు 72 వైద్య శిబిరాలు నిర్వహిస్తామని వెల్లడించారు. భక్తులకు అవసరమైన 340 రకాల మందులు, సర్జికల్ పరికరాలు, 19 అంబులెన్స్‌లు, 40 బైక్ అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచుతున్నట్లు చెప్పారు. తాడ్వాయి PHCను ఫస్ట్ రిఫరల్ కేంద్రంగా, ఏటూరు నాగారం ములుగును సెకండ్ రిఫరల్ కేంద్రాలుగా, ఎంజీఎం వరంగల్‌ను టెర్షరీ కేర్ కోసం ఉపయోగించనున్నట్లు తెలిపారు. నిపుణ వైద్యులు, ప్యారామెడికల్ సిబ్బంది, రాపిడ్ రెస్పాన్స్ టీములను ముందస్తుగా డిప్యూట్ చేస్తున్నామన్నారు. జాతరలో ఎటువంటి వైద్య ఇబ్బందులు రాకుండా జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.






# ఎయిర్ పోర్టుకు ప్రధానిచే భూమి పూజ

- పూర్తయిన డిజైన్, తొలిదశలో భూసేకరణ
- ఇక్కడి నుంచి ముందుగా ఏటీఆర్ నడుపుతాం
- ట్రైబల్ యూనివర్సిటీకి కూడా ప్రధాని భూమి పూజ చేస్తారు
- బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ది కపట నాటకం
- కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి



అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా భూమి పూజ చేపిస్తామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఆయన శనివారం వరంగల్ నగరంలో పర్యటించారు. ఉదయం తొలుత వరంగల్ రైల్వే స్టేషన్ కు చేరుకున్న కేంద్ర మంత్రి నగరంలోని భద్రకాళి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వేయి స్తంభాల టెంపుల్ ను సందర్శించి ఇక్కడ జరుగుతున్న పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తర్వాత హనుమకొండలోని హరిత హోటల్ లో అధికారులతో సమావేశమై అభివృద్ధి పనులపై సమీక్ష జరిపారు. అయోధ్యపురం వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులను పరిశీలించిన అనంతరం హరిత హోటల్ లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం భూసేకరణ తుది దశలో ఉందని చెప్పారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి డిజైన్ పూర్తయిందని, ప్రధానమంత్రి చేతుల మీదుగా భూమి పూజ చేపిస్తామని ఆయన ప్రకటించారు. మామునూరు ఎయిర్ పోర్ట్ నుంచి ముందుగా ఏటీఆర్ నడుపుతామని అన్నారు. ములుగు వద్ద రూ.1000 కోట్లతో చేపట్టిన ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణానికి కూడా ప్రధాని మోడీ భూమి పూజ చేస్తారని కేంద్ర మంత్రి చెప్పారు.

**- కపట నాటకం**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ కపట నాటకం ఆడుతుందని కేంద్రం మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. బీహార్ ఎన్నికలు పూర్తవగానే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు నిర్ణయం తీసుకుందని, తద్వారా బీసీ రిజర్వేషన్ల పట్ల కపట నాటకం బయటపడిందని అన్నారు. రిజర్వేషన్ల విషయంలో మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్ కు లేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ సీట్లలో బీసీలను తమ పార్టీ పోటీలో పెడుతోందని కిషన్ రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో మార్తినేని ధర్మారావు, జి ప్రేమేందర్ రెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, అరూరి రమేష్, సంతోష్ రెడ్డి, గంట రవికుమార్, డాక్టర్ కాళీప్రసాద్ రావు, వన్నాల శ్రీరాములు, రావుల కిషన్, జయంత్ లాల్ పాల్గొన్నారు.

# స్థానికులకు ఉద్యోగ అవకాశాలు

- మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ 75% పూర్తి
- వచ్చే ఏడాది నాటికి పూర్తి చేస్తాం
- యూనిట్ అందుబాటులోకి వస్తే బహుళ ప్రయోజనాలు
- కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి కిషన్ రెడ్డి
- కాజీపేటలోని మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ సందర్శన

అక్షరదర్బార్, హనుమకొండ: తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ 75శాతం పూర్తయిందని, సత్వరం పనులు పూర్తి చేయించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటుందని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శనివారం ఆయన హనుమకొండ జిల్లా కాజీపేట అయోధ్యపురంలోని రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను సందర్శించారు. అనంతరం నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ.. 2023లో ప్రధాని మోదీ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. 'రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్'లో భాగంగా రూ.521 కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నట్లు వివరించారు. రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ లో ప్రధాన షాప్, టెస్ట్ షాప్, పెయింట్ షాప్, స్టోర్ వార్డ్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, రెస్ట్ హౌస్, సెక్యూరిటీ, టాయిలెట్ బ్లాకులు, ప్రహరీ, ఆర్.యు.బి, అంతర్గత రైల్వే ట్రాక్, రోడ్లు, ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్, క్యాంటీన్లు సహా పలు నిర్మాణాలు జరుగుతున్నట్లు వివరించారు. యూనిట్‌లో 16 కోచ్‌ల మెము రేకులను తయారు చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు.



ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతంలోని యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. అంతకుముందు కేంద్ర మంత్రి వరంగల్ రైల్వే స్టేషన్ సందర్శించారు. ప్రయాణికులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. పర్యటనలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ఆర్వీఎన్ఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ పి.వి.సాయిప్రసాద్, దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ విజయ్ కుమార్ రథ్, సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్ గోపాలకృష్ణన్, దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ. శ్రీధర్, ఇతర సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు.

# మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వలేం

అక్షర దర్బార్, వరంగల్ : మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలంటూ రాష్ట్రం చేస్తున్న విజ్ఞప్తిపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా దేశంలో ఎక్కడ కూడా ఉత్సవాలకు కేంద్రం జాతీయ హోదా ఇవ్వలేదని, నిధులు కూడా ఇవ్వడం లేదని, మేడారం జాతర విషయంలో కూడా ఇదే విధానాన్ని కొనసాగిస్తామన్నారు. రాష్ట్రంలో రామప్ప, వేయి స్తంభాల దేవాలయం, జోగులాంబ, భద్రాచలం తదితర దేవాలయాల అభివృద్ధికి టూరిజం, ఆర్కియాలజీ ద్వారా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. రామప్ప అభివృద్ధి కోసం ఇప్పటికే 65 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరిగిందని, మరో 70 కోట్ల రూపాయలతో యూనెస్కో గుర్తింపు పొందిన రామప్ప అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో కొమరవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైల్వే స్టేషన్లో అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఇప్పటికే 40 స్టేషన్ల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు మంత్రి కిషన్ రెడ్డి వివరించారు.



# ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన టిప్పర్

- మహిళ అక్కడికక్కడే మృతి
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: కంకర లోడ్ తో అతివేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన సంఘటనలో ఓ మహిళ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గుడెప్పాడ్ కు చెందిన గంప సమ్మక్క తన మనవరాలను చూసేందుకు ఈ నెల 26న గుడాడ్ పల్లి గ్రామానికి వచ్చి శనివారం తన ఇంటికి వెళ్లడానికి ఆమె మనవడు సంతోష్ తో టీవీఎస్ ఎక్సెల్ అనే ద్విచక్ర వాహనంపై భూపాలపల్లి వైపు వస్తుండగా కొంపెల్లి వైపు ఎదురుగా వస్తున్న కంకర లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనం పైనుండి సమ్మక్క కిందపడగా ఆమె తలపై నుండి లారీ దూసుకెళ్లడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు సీఐ నరేష్ కుమార్ తెలిపారు. లారీ డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడపడంతోనే ఎదురుగా వస్తున్న టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని ఢీకొట్టడం జరిగిందని, భూపాలపల్లి రూరల్ పరిధిలోని కొంపల్లి గ్రామం సమీపంలో శనివారం చోటుచేసుకున్న ఈ సంఘటనపై మృతురాలు కుమారుడు గంప శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు భూపాలపల్లి నరేష్ కుమార్ తెలిపారు.



# సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతివ్వాలి

**యువనేత లాడే శివ**

అక్షర దర్బార్, పరకాల: తెలంగాణలో గ్రామీణ అభివృద్ధిని వేగవంతం చేయాలంటే బీజేపీ సర్పంచ్ అభ్యర్థులనే అధిక సంఖ్యలో గెలిపించాలని యువనేత లాడే శివ ప్రజలను కోరారు. గ్రామపంచాయతీ ఎన్నికలు కేవలం స్థానిక సంస్థలకే పరిమితమైపోకుండా, కేంద్రం అందించే 15వ ఫైనాన్స్ నిధులు నేరుగా గ్రామాలకు చేరేందుకు ఈ ఎన్నికలు కీలకమని ఆయన తెలిపారు.శాయంపేట మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధిస్తే, భవిష్యత్తులో తెలంగాణ పల్లెల అభివృద్ధికి మరింత బలం చేకూరుతుందని లాడే శివ అభిప్రాయపడ్డారు. గ్రామాల్లో డంపింగ్ యార్డులు, స్మశాన వాటికలు, మౌలిక వసతులు వంటి అంశాల్లో బీజేపీ అధికారం ఉన్న చోట అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని గుర్తుచేశారు.కరోనా మహమ్మారి సమయంలో పేదలను ఆదుకోవడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చూపిన నాయకత్వాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించిన ఆయన—ఉచిత రేషన్ బియ్యం, కరోనా వ్యాక్సిన్, జీరో బ్యాలెన్స్ ఖాతాల్లో ఆర్థిక సహాయం, అనేక సంక్షేమ పథకాలు కేంద్రం అమలు చేసి కోట్లాది మందిని కాపాడిన విషయాన్ని గుర్తుచేశారు.ఈ సేవలకు గుర్తుగా, గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీజేపీ సర్పంచ్‌లను గెలిపించి మోడీకి బహుమతిగా అందిద్దాం అని పిలుపునిచ్చారు. తెలంగాణ గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే ఈ ఎన్నికల్లో ప్రజలు సక్రమంగా ఆలోచించి ఓటు వేయాలని యువనేత లాడే శివ ఆకాంక్ష వ్యక్తం చేశారు.



# ఆదరించి గెలిపించండి

**- 12వ వార్డ్ మెంబర్ అభ్యర్థి మంద ప్రవీణ్**

అక్షర దర్బార్, కేసముద్రం : ఆశతో కాదు జనాలకు సేవ చేయాలనే ఆశయంతో మీ ముందుకు వస్తున్న ఆదరించి గెలిపించాలని మంద ప్రవీణ్ ప్రజలను కోరారు. శనివారం నాడు ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ 12వ వార్డు మెంబర్గా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉప్పరపల్లి గ్రామంలోని 12వ వార్డులో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డులోని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని వాటిపై గళం విప్పే నాయకుడు కావాలన్నారు. నాయకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తానని తెలిపారు. హరిజనవాడను మరింత అభివృద్ధి పరిచి సమస్యలు లేని వార్డుగా తీర్చిదిద్దుతానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు అయినా కాలనీలో అభివృద్ధి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరూ తనను ఆదరించి అధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన వేడుకున్నారు. కార్యక్రమంలో మంద నాగేంద్రబాబు, సీనియర్ జర్నలిస్టు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు అందజేత

**–సీఐ దొమ్మటి నరేష్**

అక్షర దర్బార్, భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గతంలో పోగొట్టుకున్న నాలుగు మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందజేసినట్లు భూపాలపల్లి సీఐ దొమ్మటి నరేష్ తెలిపారు. శనివారం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో మొబైల్ ఫోన్ల హస్తాంతరణ కార్యక్రమం జరిగింది. లపాక రవి – రెడ్ మీ, తూటి సంపత్ – వన్ ప్లస్, వెల్దాసంపత్ –వీవో, రఫీ ఖాన్ – (వన్ ప్లస్) ఉన్నాయి. ఈ మొబైల్ ఫోన్లను CEIR పోర్టల్ సాయంతో స్టేషన్ కానిస్టేబుల్ సుంకే మహేష్ గుర్తించగా, సీఐ నరేష్ కుమార్ బాధితులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా సీఐ నరేష్ మాట్లాడుతూ.. "ఎవరైనా వారి మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే, CEIR పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి తిరిగి అందజేస్తాం" అని తెలిపారు.



## పోలింగ్ కేంద్రాల పరిశీలనలో

# ఎఫ్ఎస్ టీ బృందం

అక్షర దర్బార్, పరకాల: పరకాల మండలంలోని గ్రామపంచాయతి ఎన్నికల నేపధ్యంలో ఎఫ్ఎస్‌టీ బృందం శుక్రవారం పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించింది. నాగారం, పైడిపల్లి, మల్లక్క పేట, వెంకటాపురం, లక్ష్మీపురం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించిన అధికారులు, కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించారు.పోలింగ్ స్టేషన్‌లలో కరెంటు సరఫరా, తాగునీరు, టాయిలెట్ సదుపాయం, వీల్‌చైర్ వంటి వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు ఎఫ్ఎస్‌టీ అధికారులు స్పష్టం చేశారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు వంటి ప్రచార సామగ్రి పూర్తిగా తొలగించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఎఫ్ఎస్‌టీ అధికారి నాగరాజు, పోలీస్ అధికారి నాగరాజు పాల్గొన్నారు. మొత్తం కార్యక్రమాన్ని కెమెరామెన్ భాస్కర్ చిత్రీకరించారు.



# బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

అక్షర దర్బార్, నర్సంపేట : గ్రామాల అభివృద్ధి బీజేపీ ద్వారానే సాధ్యమని వరంగల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. నల్లబెల్లి మండలానికి చెందిన జక్కోజు కృష్ణ, కొండ్లె శ్రావణ్, మంద లోకేష్, త్రికోవెల గోవర్ధన్ లు శనివారం బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు తడుక వినయ్ అధ్యక్షతన, రాణా ప్రతాప్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. వీరు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుండి బీజేపీకి చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. "ప్రధాని నరేంద్ర మోదీ గారి ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల నిజమైన అభివృద్ధి జరుగుతోంది. ఈ విషయాన్ని గ్రహించిన పలువురు యువకులు, నాయకులు బీజేపీ వైపు వస్తున్నారు" అని అన్నారు. కార్యక్రమంలో నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, బీజేపీ నల్లబెల్లి మండల నాయకులు మరియు ఇతర ఎమ్మెల్యేలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహిళా కాంగ్రెస్ నేతలు సస్పెన్షన్

అక్షర దర్బార్, నర్సంపేట : పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న మహిళా కాంగ్రెస్ నేతలను శనివారం సస్పెండ్ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని రాజేందర్. తెలిపాడు. నర్సంపేట పార్టీ కార్యాలయంలో రాజేందర్ మాట్లాడుతూ నర్సంపేట మాజీ సర్పంచ్ చిలువేరు రజిని భారతి,జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి తక్కళ్లపెల్లి ఉమా గత కొన్ని రోజులుగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న నేపథ్యంలో నేపథ్యంలో నర్సంపేట నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నుంచి నేడు బహిష్కరిస్తున్నట్టు తెలిపాడు. నేటి నుంచి వీరికి కాంగ్రెస్ పార్టీతో గాని, పార్టీ కార్యకలాపాలకు ఎటువంటి సంబంధం లేదన్నారు.





## డ్రైనేజీ మధ్యలోనే

# కరెంటు స్తంభం

**ప్రణాళిక బద్ధంగా డ్రైనేజ్ నిర్మించాలి**

**బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం**

అక్షర దర్బార్, పరకాల: పరకాలలో జరుగుతున్న డ్రైనేజీ పనుల్లో నిర్లక్ష్యం వెలుగుచూసింది. జయ టాకీస్ రోడ్డులో నిర్మిస్తున్న డ్రైనేజీ మార్గంలోనే కాంట్రాక్టర్ కరెంటు స్తంభాన్ని మధ్యలో ఉంచి నిర్మాణం కొనసాగించడంతో స్థానికులలో ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. చెత్త తగిలితే నీటిమార్గం మూసుకుపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంలో బీజేపీ పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం స్పందిస్తూ ప్రజా సౌకర్యాల కోసం నిర్మించే డ్రైనేజీలను ప్రణాళికాబద్ధంగా నిర్మించడం అవసరమన్నారు. ఏ అడ్డంకి వచ్చినా అలాగే వదిలేసి డ్రైనేజీ కట్టుకునే పాత పద్ధతులను మానుకుని, శాస్త్రీయంగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మించాలని కోరారు.పట్టణ అభివృద్ధి పేరుతో కొంతమంది కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా పనులు చేయడం వల్ల ఇలాంటి సమస్యలు వస్తున్నాయని, అధికారులు వెంటనే జోక్యం చేసుకుని స్తంభం స్థానాన్ని మార్చి డ్రైనేజీని సరిచేయాలని ఆయన డిమాండ్ చేశారు.





# గీతాంజలి విద్యార్థి ప్రతిభ

అక్షర దర్బార్, నర్సంపేట : జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో గీతాంజలి విద్యార్థి ప్రతిభను చాటి బహుమతులు సాధించారు. జిల్లా స్థాయిలో జరిగిన బాల వైజ్ఞానిక ప్రదర్శనలో గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని కే అభిజ్ఞ వ్యర్థ పదార్థాల నిర్వహణ మరియు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలు అనే అంశంలో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి జిల్లా స్థాయిలో అన్ని పాఠశాల విద్యార్థులను దాటుకొని బహుమతి సాధించింది. ఈ సందర్భంగా గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు గారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టాలకు తలొగ్గకుండా పనిచేస్తేనే విజయం కలుగుతుందని వివరించారు. తదనంతరం ప్రధానోపాధ్యాయులు ఎన్. రాజేష్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న సమాజంలో ఎప్పుడూ అవకాశాలు కనిపిస్తూనే ఉంటాయి. బహుమతి సాధించిన విద్యార్థినిని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు.

# 85 గ్రామాల్లో రెండో విడత

- రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

అక్షరదర్బార్, భూపాలపల్లి: గ్రామపంచాయతీ 2వ విడత ఎన్నికల నిర్వహణకు 30వ తేది ఆదివారం ఉదయం 10.30 గంటల లోపు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆదివారం 2వ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు నోటిఫికేషన్, అనంతరం 30వ తేది నుండి డిసెంబర్ 2వ తేదీ వరకు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. 2వ విడతలో చిట్యాల మండలంలో 26 గ్రామ పంచాయతులకు, 218 వార్డులకు, టేకుమట్ల మండలంలో 25 పంచాయతులకు,198 వార్డులకు, భూపాలపల్లి మండలంలో 26 గ్రామ పంచాయతీలకు, 216 వార్డులకు, పలిమెల మండలంలో 8 గ్రామ పంచాయతీలకు 62 వార్డులకు మొత్తం నాలుగు మండలాలలోని 85 గ్రామ పంచాయతీలకు, 694 వార్డులలో ఎన్నికలు నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంగం మార్గదర్శకాల. మేరకు నోటిఫికేషన్, నామినేషన్లు స్వీకరణ ప్రక్రియ ఆదివారం ప్రారంభం అవుతుందని తెలిపారు. నోటిఫికేషన్ గ్రామ పంచాయతీ కార్యాలయం, గ్రామంలోని ప్రధాన కూడళ్ళలో ఏర్పాటు చేయాలని, అలాగే ఓటరు జాబితా నోటీస్ బోర్డులో పెట్టాలని సూచించారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

# కేంద్ర మంత్రిని కలిసిన సిరంగి సంతోష్ కుమార్

అక్షర దర్బార్, పరకాల: వరంగల్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ, వేయి స్తంభాల గుడి పునర్నిర్మాణం,కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్,రామప్ప దేవాలయం అభివృద్ధి తదితర పనులపై సమీక్ష నిర్వహించడానికి వరంగల్ కు విచ్చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ కలిసి భద్రకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలలో వారితో పాల్గొన్నారు.







# గులాబీ శ్రేణుల 'దీక్షా దివస్' యాది

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు
- కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకున్న నేతలు
- కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు

అక్షరదర్బార్, హనుమకొండ: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత, ఉద్యమ నేత కేసీఆర్ 2009లో చేపట్టిన చారిత్రక 'ఆమరణ నిరాహార దీక్ష' స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన గులాబీ శ్రేణులు శనివారం 'దీక్షా దివస్' కార్యక్రమాలు నిర్వహించాయి. హనుమకొండలోని నక్కలగుట్ట వద్ద ఉన్న కాళోజీ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో పలువురు బీఆర్ ఎస్ నేతలు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పాల్గొన్నారు. తెలంగాణ కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన వీరుడు కేసీఆర్ అని కొనియాడారు. మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ.. కేసీఆర్ పోరాటం వల్లే తెలంగాణ వచ్చిందని స్పష్టం చేశారు. 2009 ఆమరణ నిరాహార దీక్షకు బయల్దేరిన రోజు నుంచి నేటి వరకు ఆయన ఉద్యమ ప్రస్థానంలో తాను కొనసాగానని గుర్తుచేశారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల 60 ఏళ్ల కలను సాకారం చేసిన నేత కేసీఆర్ అన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, వొడితల సతీష్ బాబు, పార్టీ నేతలు నాగుర్ల వెంకటేశ్వర్లు, లింగంపెల్లి కిషన్ రెడ్డి, మర్రి యాదవ రెడ్డి, ఎల్లావుల లలితా యాదవ్, గ్రేటర్ వరంగల్ డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్, కార్పొరేటర్లు సోదా కిరణ్, బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సంకు నర్సింగ రావు, బోయినపల్లి రంజిత్ రావు, ఇమ్మడి లోహితా రాజు, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, కుసుమ లక్ష్మీనారాయణ, ఉడతల సారంగపాణి, నాయకులు జనార్దన్ గౌడ్, రవీందర్ రావు, నాయిమొద్దీన్, పులి రజినీకాంత్, రజినీకుమార్, హరి రమాదేవి, దూలం వెంకన్నపాల్గొన్నారు.





# రేపటి నుంచి రెండో విడత నామినేషన్లు

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ఎంపీడీవోలు, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్



అక్షరదర్బార్, హనుమకొండ: జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆదివారం నుంచి మొదలవుతుందని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సంబంధిత మండలాల ఎంపీడీవోలు, అధికారులు పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్ నుంచి రెండో విడతలో నామినేషన్లు ఈ నెల 30 నుండి డిసెంబర్ 2 తేదీ వరకు స్వీకరించనున్న ధర్మసాగర్, హసన్ పర్తి, ఐనవోలు, పరకాల, వేలేరు మండలాల ఎంపీడీవోలు, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రెండో విడత నామినేషన్ల ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎంపీడీవోల వద్ద నుండి నామినేషన్ల సామగ్రిని రిటర్నింగ్ అధికారులు వెంటనే తీసుకోవాలన్నారు. నామినేషన్ల సామగ్రిని తనిఖీ చేసుకోవాలని సూచించారు. క్లస్టర్ నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలకు సూచించారు. హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. డేటా ఎంట్రీ చేయడంలో ఆలస్యం జరగకుండా చూసుకోవాలని తెలిపారు. ఎంసీసీ నిబంధనలు పాటించాలని, ఎఫ్ఎస్ టి, ఎస్ఎస్ టి బృందాలు తనిఖీలు చేయాలన్నారు. కాగా రెండవ విడతలో ఆదివారం నుంచి నామినేషన్ల స్వీకరణ జరిగే ధర్మసాగర్ మండలంలో 19 గ్రామ పంచాయతీలు, 186 వార్డులు, 186 పోలింగ్ కేంద్రాలు, హసన్ పర్తి మండలంలో 15 గ్రామ పంచాయతీలు, 138 వార్డు స్థానాలు, 138 పోలింగ్ కేంద్రాలు, ఐనవోలు మండలంలో 17 గ్రామపంచాయతీలు, 170 వార్డులు, 170 పోలింగ్ కేంద్రాలు, వేలేరు మండలంలో 12 గ్రామ పంచాయతీలు, 106 వార్డులు, 106 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పరకాల మండలంలో 10 గ్రామపంచాయతీలు, 94 వార్డులు, 94 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

# ముగిసిన నామినేషన్ల గడువు

- చివరి రోజు జోరుగా నామినేషన్ల దాఖలు
- సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటాపోటీగా నామినేషన్లు
- రేపటి నుంచి రెండో విడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ
- ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

అక్షరదర్బార్, వరంగల్: పంచాయతీ ఎన్నికల మొదటి దశ నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసింది. మూడు రోజులపాటు సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మొదటి విడత 11న ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల్లో ఈనెల 27 నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలైంది. గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజులపాటు సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. చివరి రోజైన శనివారం సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు కావడంతో శనివారం ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో నామినేషన్ల కోలాహలం కనబడింది.



## - ఉమ్మడి వరంగల్ జిల్లాలో

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మొదటి విడత నామినేషన్ల స్వీకరణ ప్రశాంతంగా ముగిసింది. మొదటి విడతలో హనుమకొండ జిల్లాలో భీమదేవరపల్లి, కమలాపురం, ఎల్కతుర్తి మండలాల్లో, వరంగల్ జిల్లాలో రాయపర్తి, పర్వతగిరి, వర్ధన్నపేట మండలాల్లో, మహబూబాబాద్ జిల్లాలో కేసముద్రం, ఇనుగుర్తి, గూడూరు, నెల్లికుదురు, మహబూబాబాద్ మండలాల్లో, భూపాలపల్లి జిల్లాలో గణపురం, గోరికొత్తపల్లి, రేగొండ, మొగుళ్లపల్లి మండలాలతోపాటు ములుగు జిల్లాలోని మూడు మండలాల్లో ఆయా గ్రామపంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు నామినేషన్ల సేకరణ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతుతో ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయటం కనబడింది.

## - రేపటి నుంచి రెండో విడత

డిసెంబర్ 14న జరిగే రెండో విడత పంచాయతీ ఎన్నికల కోసం ఆదివారం నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలుకానుంది. రెండో విడతలో ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల్లో మూడు రోజులపాటు నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. రెండో విడత ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల్లో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు జిల్లా కలెక్టర్లు శనివారం సూచనలు చేశారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

*డిజిటల్ విప్లవంలో భాగంకండి!*

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915